దేశానికే దిశా నిర్దేశంగా తెలంగాణ

- రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎన్. ప్రీతమ్

వనపర్తి టౌన్, జూన్ 2 : రాష్ట్రంలోని పేద, బడుగు, బల హీన వర్గాల సంక్షేమంతో పాటు సామాజిక న్యాయంలో తెలంగాణ దేశానికి దిశా నిర్దేశం చేస్తుందని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎన్ ప్రీతమ్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రీతమ్ హాజరయ్యారు. ఆయనతో పాటు కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్, ఎమ్మెల్యే మేఘారెడ్డి, అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, యాదయ్య, వనపర్తి మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు. ముందుగా కలెక్టర్, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రీతమ్ తెలంగాణ అమరవీరుల స్థూపానికి పుష్ప గుచ్ఛంతో నివాళులర్పించారు. అనంతరం పోలీసు బలగాల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ పతకాన్ని ఎగురవేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. రాష్ట్రం ఆవిర్భవించి నేటితో 11 ఏండ్లు నిండాయన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం పోరాడిన వారి కుటుంబ సభ్యులను సత్కరించారు. అదేవిధంగా వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం కలెక్టరేట్ ఆవరణంలో పోలీస్ శాఖ, ఎస్సీ కార్పొరేషన్, జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా వైద్య శాఖ, జిల్లా వ్యవసాయ శాఖ , పురపాలక , గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ , ఎమ్మెల్యేతో కలిసి ఆయన తిలకించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న ఎన్ ప్రీతమ్, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

అభివృద్ధి పథంలో జిల్లా పయనం

- ప్రభుత్వ సలహాదారుడు ఏపీ జితేందర్ రెడ్డి
- నడిగడ్డలో ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

గద్వాల అర్బన్, జూన్ 2 : అభివృద్ధి పథంలో జిల్లా పయనిస్తుందని ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, ప్రభుత్వ సలహాదారుడు ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సముదాయంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా జితేందర్‌రెడ్డి, ఎంపీ మల్లు రవి పాల్గొన్నారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ స్వరాష్ట్ర సాధనలో ప్రాణత్యాగం చేసిన నడిగడ్డ చెందిన పాస్యం సర్వారెడ్డి, కొట్టం వేణుగోపాల్‌తోపాటు తొలి దశ తెలంగాణ ఉద్యమంలో అమరులైన వీరులందరికీ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలో అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. అంతకు ముందు స్మృతి వనంలోని అమరవీరుల స్మారక స్తూపానికి జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద గల 1969 తొలి దశ తెలంగాణ ఉద్యమంలో తమ ప్రాణాలను అర్పించిన పాస్యం సర్వారెడ్డి, కొట్టం వేణుగోపాల్ అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ వేడుకల్లో కలెక్టర్ సంతోష్, ఎస్పీ తోట శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో అలివేలు, ఇతర శాఖ అధికారులు ఉన్నారు.

జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఏపీ జితేందర్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ మల్లురవి, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు

నాణ్యమైన విత్తనం లాభసాటి వ్యవసాయానికి సోపానం

విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల అర్బన్,జూన్ 2 : నాణ్యమైన విత్తనాలు వేసి రైతులు లాభసాటి వ్యవసాయం చేయాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి రైతులకు సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాణ్యమైన విత్తనం లాభసాటి వ్యవసాయానికి సోపానం అనే కార్యక్రమంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు వరి విత్తనాలు ఆర్ఎన్ఆర్(15048) అధిక దిగుబడి కోసం అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం వ్యవసాయ అధికారులతో కలిసి గద్వాల నియోజకవర్గానికి చెందిన పలువురు రైతులకు 10 కేజీల వరి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రతాప్ గౌడ్, నాయకులు రమేశ్‌నాయుడు, కుర్మన్న, అబ్దుల్ మెబిన్, వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నారు.

కేసీఆర్‌ది ప్రజాసంక్షేమ పాలన

- కాంగ్రెస్ ది విధ్వంసకర పరిపాలన
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్

వనపర్తి టౌన్, జూన్ 2 : కేసీఆర్‌ది ప్రజా సంక్షేమ పరిపాలన అని, కాంగ్రెస్ పార్టీది విధ్వంసకర పరిపాలన అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, పట్టణ అధ్యక్షుడు పి.రమేశ్‌గౌడ్ అన్నారు. సోమవారం రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు నాగవరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా అమరవీరులకు, తెలంగాణ తల్లికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా జాతీయ జెండాను గట్టు యాదవ్ , రమేశ్‌గౌడ్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. నాయకులు, కార్యకర్తలు అవతరణ దినోత్సవ కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్‌ను ఆదర్శంగా తీసుకొని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి వనపర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, లక్ష ఎకరాలకు సాగునీరు అందించి రైతును రాజుగా చేసిన ఘనత ఆయనదేనన్నారు. దశాబ్దాల కల రోడ్ల విస్తరణ, చెరువుల పునరుద్ధరణ, ఐటీ టవర్, జెన్‌టీయూ కళాశాల, అగ్రికల్చర్ కళాశాల, ఫిషరీస్ కళాశాల, మెడికల్ కళాశాల, మాతా శిశు సంరక్షణ కేంద్రం వంటి అనేక అభివృద్ధి పథకాలు సాధించారని, నేడు నియోజకవర్గం అభివృద్ధి లేక ఆగమైందని విమర్శించారు.

కంటి వైద్య శిబిరం విజయవంతం

జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని 20వ వార్డు గాంధీనగర్‌లో బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. సోషల్ మీడియా కన్వీనర్ సునిల్ వాల్మీకి ఆధ్వర్యంలో శ్రీ సాయి నేత్రాలయ కంటి దవాఖాన నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 300మంది పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధికార ప్రతినిది వాకిటి శ్రీధర్, మీడియా సెల్ కన్వీనర్ నందిమల్ల అశోక్, నాయకులు గంధం పరంజ్యోతి, కురుమూర్తి యాదవ్, వెంకటస్వామి, దిలీప్‌రెడ్డి, బాలరాజు, మతిన్, ఉంగ్లం తిరుమల్, కంచ రవి, వసంత, రహీం, గులాం ఖాదర్, ఎర్ర శ్రీను, ఇమ్రాన్ బిన్ అలీ, కాలూరి రవి, గిరి, హేమంత్, చిట్యాల రాము, డేగ మహేశ్వర్‌రెడ్డి, కర్రెస్వామి, రఘుపతిరెడ్డి, మల్లారెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, రవిప్రకాశ్‌రెడ్డి, ధర్మానాయక్, జాత్రునాయక్, గులాంఖాదర్, జోహెబ్, కృష్ణ, నాగన్న యాదవ్, రంచెరవి, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, స్టార్ రహీం, , విజయ్‌కుమార్, భానుప్రకాశ్‌రావు, జగన్నాథంనాయుడు, సయ్యద్ జావీద్, అప్రోజ్, నర్సింహ, క్రాంతికుమార్, శంకర్, బుచ్చిబాబు, అరున్, ప్రణీత్, జాషువా, భాను యాదవ్,శ్రవణ్‌కుమార్, ఉదయ్, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అన్ని జీపీల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు

వనపర్తి టౌన్, జూన్ 2 : జూన్ 3వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని మండలాల గ్రామపంచాయతీల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రతి మండలం నుంచి రెండు బృందాలను ఏర్పాటు చేసి ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఒక్కో బృందం ఒక్కో గ్రామ పంచాయతీలో పర్యటించి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జూన్ 20 వరకు ప్రతి మండలంలో షెడ్యుల్ వారీగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భూ సమస్యలు ఉన్న ప్రజలు నిర్ణీత ప్రోఫార్మాలో తమ సమస్యలను దరఖాస్తు చేసుకొని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

నేడు ఆరు మండలాలకు మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్

అయిజ, జూన్ 3 : అయిజ పట్టణానికి సమీపంలోని భారత్‌మాల రహదారి పనుల్లో భాగంగా మిషన్ భగీరథ పైప్‌లైన్ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తుండటంతో మంగళవారం అయిజ, వడ్డెపల్లి, రాజోళి, ఉండవెల్లి, మానవపాడు, అలంపూర్ మండలాలకు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మిషన్ భగీరథ గ్రిడ్ డీఈ రవిచంద్రకుమార్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

గద్వాలటౌన్, జూన్ 2: జిల్లాలోని ప్రభుత్వ, అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్, ఐటీఐ కళాశాలలో 2025-27కు గానూ ఎన్‌సీవీటీ ప్యాట్రన్ కింద ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ కళాశాల జిల్లా కో కన్వీనర్ సత్యనారాయణ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆగస్టు ఒకటి నాటికి 14ఏండ్లు నిండి ఉండాలన్నారు. 8,10వ తరగతులు ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 8వ తరగతి వరకు పాసైన వారు కొన్ని కోర్సులకు మాత్రమే అర్హులని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9110523925,9885249516 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి రూ.5లక్షల విరాళం

కొత్తకోట, జూన్ 2 : కొత్తకోట పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణానికి కొత్తకోట పట్టణానికి చెందిన కీ.శే.పొగాకు శైలజమ్మ పొగాకు భద్రప్ప వారి జ్ఞాపకార్థం వారి మనువడు డాక్టర్ అభిషేక్ జన్మదినం సందర్భంగా కొత్త కోట పట్టణ ప్రముఖ బంగారు వ్యాపారి శ్రీ పరమేశ్వరి జ్యూవేలర్స్ యజమాని పొగాకు శిరీష రాఘవేంద్ర ప్రసాద్ దంపతులు రూ.5,01,116ల విరాళం ప్రకటించారు. ఈ విరాళాన్ని అయ్యప్ప సేవా సమితి సభ్యులు ధూపం నాగరాజు, పొగాకు అనిల్ కుమార్, విశ్వనాథం గంగాధర్, సత్యం సాగర్, వేముల సుధాకర్ రెడ్డి, వారణాసి సతీశ్‌కుమార్, దివాకర్ రావ్, బాలయ్య నాయుడు, భీమ కిశోర్‌లకు అందజేశారు. సందర్భంగా అయ్యప్ప సేవా సమితి సభ్యులు దాతలను శాలువాతో సన్మానించారు.

రెవెన్యూ సదస్సులో పాల్గొనాలి

- నూతన ఆర్డీవో అలివేలు

గద్వాల అర్బన్, జూన్ 1 : నేటి నుంచి ఆయా గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులో ప్రజలందరూ పాల్గొనాలని ఆర్డీవో అలివేలు పేర్కొన్నారు. గద్వాల డివిజన్ నూతన ఆర్డీవోగా అలివేలు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొన్ని నెలలుగా ఖాళీగా ఉన్న గద్వాల డివిజన్ ఆర్డీవో పోస్టులో ప్రభుత్వం బదిలీపై అమెను నియమించింది. ప్రస్తుతం అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు నుంచి అమె బాధ్యతలను స్వీకరించారు. ఇంతకు ముందు ఆమె వరంగల్ జిల్లా గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. సోమవారం కలెక్టర్, అదనపు కలెక్టర్లను నూతన ఆర్డీవో మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకెను అందజేశారు.

నేటి నుంచి భూ భారతి రెవెన్యూ సదస్సులు

ఖిల్లాఘణపురం, జూన్ 2: నేటి నుంచి గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు తాసీల్దార్ సుగుణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో ఆమె రెవిన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించి గ్రామాలవారీగా సదస్సుల వివరాలను వెల్లడించారు. 3న అల్లమాయిపల్లి, తిరుమలాపూర్, 4న అగారం, వెంకటాపల్లి, 5న సల్కలాపూర్, అంతాయపల్లి, 6న పర్వతాపూర్, 9 నుంచి 10వ తేదీ వరకు సోలీపూర్, అదేవిధంగా 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు మామిడిమాడ, 10న మల్కాపూర్, 11న ఉప్పర్‌పల్లి, సూరాయపల్లి, 12న షాపూర్, కమాలుద్దీన్ పుల్, 13న అప్పారెడ్డిపల్లి, మల్కిమియాన్‌పల్లి, 16న అన్‌ప పాడ్ (డి), గర్‌కాస (డి), 17న నుంచి 18 వరకు ఖిల్లా ఘణపురం, మానాజిపేట గ్రామాల్లో రెండు బృందాలుగా రెవెన్యూ అధికారులు భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారని ఆమె చెప్పారు.

రాజోళి మండలంలో..

రాజోళి, జూన్ 2: నేటి నుంచి మండల పరిధిలో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తాసీల్దార్ రామ్మోహన్ సోమవారం ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి ఈనెల 16తేదీ వరకు ప్రతి రోజూ ఒక గ్రామంలో రెవెన్యూ అధికారులు గ్రామ ప్రజల వద్దకు వెళ్లి సమస్యలపై దరఖాస్తులు తీసుకుంటారని తెలిపారు. మండల రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ప్రజలకు భరోసా కల్పిస్తున్నాం..

- జోగులాంబ గద్వాల ఎస్పీ తోట శ్రీనివాస రావు

జాతీయ నాయకుల చిత్రపటాలకు పూజ చేస్తున్న ఎస్పీ తోట శ్రీనివాస రావు

గద్వాల అర్బన్, జూన్ 2 : శాంతి యుత వాతావరణం ఉన్నప్పుడే అభివృద్ధి వేగవంతమవుతుందని, సంఘ విద్రోహ శక్తుల పట్ల కఠినంగా ఉంటూ సామాన్య ప్రజలకు భరోసా కల్పిస్తూ, ఎలాంటి వివక్ష లేకుండా ప్రజలందరికీ ఒకే రకమైన సేవలు అందిస్తున్నామని ఎస్పీ తోట శ్రీనివాసరావు పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను జిల్లా ఆవిష్కరించి మాట్లాడారు. అధికారులు , సిబ్బంది మరింత మెరుగైన సేవలను అందిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అంతకు ముందు జిల్లా ప్రజలు, పోలీస్ అధికారులు, సిబ్బందికి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ మొగిలయ్య, సాయుధ దళ డీఎస్పీ నరేందర్ రావు, సీఐ శ్రీను, ఆర్ఐ వెంకటేశ్, ఆయా పోలీస్ స్టేషన్ల ఎస్సైలు పాల్గొన్నారు.

మహనీయుల పోరాటాల త్యాగ ఫలితం గొప్పది

ఎస్పీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

- ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి టౌన్, జూన్ 2 : ఎందరో మహనీయుల పోరాటాల త్యాగ ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వనపర్తి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రావుల గిరిధర్ సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పోలీసు మహోన్నత సేవా పతకాలు అందుకున్న పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, డీసీఆర్బీ డీఎస్పీ ఉమా మహేశ్వరరావు, జిల్లా పోలీస్ కార్యాలయం ఏవో సునందన, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేశ్, సీఐలు కృష్ణయ్య, రాంబాబు, శివకుమార్, రవిపాల్, రిజర్వ్ ఇన్ స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, జిల్లాలోని పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నడిగడ్డలో మొదలైన ఆధిపత్య పోరు

- జోగులాంబ ఆలయ దర్శనానికి ఎంపీ వచ్చినా ..

పట్టించుకోని స్థానిక కాంగ్రెస్ నాయకులు

అలంపూర్, జూన్ 2 : పట్టణంలోని జోగులాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను సోమవారం నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి దర్శించుకున్నారు. అమ్మవారు, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా మూడు జిల్లాలకు సంబంధించిన ఎంపీ, కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ సంఘం రాష్ట్ర చైర్మన్ మల్లు రవి ఆలయ దర్శనం కోసం అలంపూర్ నియోజకవర్గానికి వస్తే స్థానికంగా ఉండే కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ఒకరు కూడా ఆయన వెంట లేకపోవడంపై పలు విధాల చర్చించుకుంటున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడుతో కలిసి ఎంపీ మల్లు రవి జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ ఇంటికి వెళ్లాడు. దీంతో అధికార పార్టీ నాయకులు తమను పట్టించుకోకుండా ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే విజయుడును చేర దీశారన్న ఆరోపిస్తూ సోమవారం అలంపూర్‌లో ఎంపీ కార్యక్రమాలను బహిష్కరించారు. దీనిలో భాగంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఒకరూ కూడా ఎంపీని కనీసం మర్యాదపూర్వకంగా కూడా కలువలేదు. దీంతో అధికార పార్టీలో ఆధిపత్య పోరు మొదలైందిదనే గుసగుసలు వినబడుతున్నాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గోపాల్‌పేట, జూన్ 2 : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన ఏదుట్లలో చోటు చేసుకున్నది. ఎస్సై నరేశ్ కథనం మేరకు..మండలంలోని ఏదుట్ల గ్రామానికి చెందిన గుడ్ల కోటయ్య (65) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై మే 30న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉన్న గుళికల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్స కోసం అతడిని వనపర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ అతడు సోమవారం దవాఖానలో మృతి చెందాడు. మృతుడి కొడుకు గుడ్ల కుర్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, మృతదేహాన్ని అక్కడే పోస్టుమార్టం చేయించి, కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య మృతి చెందగా, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఉరివేసుకొని యువకుడు మృతి

పెద్దమందడి, జూన్ 2: చెట్టుకు ఉరేసుకొని యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని మద్దిగట్ల గ్రామంలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని మద్దిగట్ల గ్రామానికి చెందిన పుట్ట మోహన్ ప్రవీణ్ (35) తాగుడుకు బానిసై ఆర్థిక ఇబ్బందులతో క్షణికావేశం లో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, స్థానికుల సమాచారం మేరకు ఎస్సై శివకుమార్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కిందకు దింపి కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

గద్వాల అర్బన్, జూన్ 2 : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందిన ఘటన గద్వాల మండలం పరిధిలోని సంగాల స్టేజీ సమీపంలో చోటు చేసుకున్నది. గద్వాల రూరల్ ఎస్సై శ్రీకాంత్ కథనం మేరకు...జిల్లా కేంద్రానికి చెందిన శ్రీలత (28) మేస్త్రీ పని చేయడానికి ధరూర్ మండలంలోని బూరెడ్డిపల్లి గ్రామానికి వెళ్లి పనులు ముగించుకొని తిరుగు ప్రయాణంలో బూరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్‌పై గద్వాలకు బయలుదేరింది. ఈ క్రమంలో గద్వాల మండలం సమీపంలోని సంగాల స్టేజీ వద్ద ట్రాక్టర్ డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో ట్రాక్టర్ ట్రాలీ గేడ్ మీద కూర్చున్న శ్రీలత ఎగిరి కిందకు పడడంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో స్థానికులు గమనించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం ఆమెను కర్నూల్ తరలించగా చికిత్స పొందుతు మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడి

పాన్‌గల్,జూన్ 2 : రైతులు సేంద్రియ ఎరువులు వాడి అధిక దిగుబడి పొందాలని వ్యవసాయ సహాయ సంచాలకులు చంద్రశేఖర్, కృషి విజ్ఞాన శాస్త్రవేత్త భవాని, అనిత్ కుమార్ కోరారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని రైతువేదిక, దొండాయపల్లి గ్రామాల్లో వ్యవసాయసాగులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా, డీఏపీ తదితర మందులను తగిన మోతాదులో వినియోగించాలని కోరారు. సమావేశంలో ఏవో రాజవర్ధన్‌రెడ్డి, ఏఈవోలు నరేశ్, వెంకటేశ్, షర్మిల, అఖిల పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త భవాని

కేసీఆర్ పదేండ్ల పాలన దేశానికే ఆదర్శం

- గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతునాయుడు

గద్వాల టౌన్, జూన్ 2 : కేసీఆర్ పదేండ్ల పాలన దేశానికి ఆదర్శంగా నిలిచిందని గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతునాయుడు కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా పార్టీ కార్యాలయంలో బాసు హనుమంతునాయుడు జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ తల్లి, గాంధీజీ, ప్రొఫెసర్ జయశంకర్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాలన్న స్ఫూర్తితో కేసీఆర్ ప్రభుత్వం పాలన సాగించిందని గుర్తుచేశారు. ప్రతి ఊరికి, ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత బీఆర్ఎస్‌కు దక్కిందన్నారు. కార్యక్రమంలో చక్రధర్‌రావు, పటేల్ జనార్దన్‌రెడ్డి, అంగడి బస్వరాజ్, సోమ శేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శేఖర్‌నాయుడు, రాజారెడ్డి, గంజిపేట రాజు, మక్బూల్, కురువ పల్లయ్య, తిరుమలేష్, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గద్వాల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

కేసీఆర్ దీక్షతోనే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు

ఆత్మకూర్ పట్టణంలో బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తున్న మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్

అమరచింత, జూన్2 : మాజీ సీఎం కేసీఆర్ చావు నోట్లో తలపెట్టి అమరణ నిరాహారదీక్ష చేయడం తోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయ్యిందని బీఆర్ఎస్ నాయకులు రవికుమార్‌యాదవ్, రాజు, రమేశ్, నర్సింహులుగౌడ్ పేర